క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

కోసిగి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ నాగేషప్ప సూచించారు. బుధవారం మండలంలోని సజ్జలగుడ్డం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి రుచి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం,నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. హెచ్ఎం ప్రసాద్ ఉన్నారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

ఆదోనిరూరల్ : ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటల్లో చేపట్టే పంటకోత ప్రయోగంపై బుధవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. జిల్లా కేంద్రం కర్నూలు సీపీఓ కార్యాలయం నుంచి ఉపగణాంకాధికారి రమణ, అసిస్టెంట్ డైరెక్టర్ భారతి పాల్గొని డివిజన్‌లోని ఆదోని, కౌతాళం, పెద్దకడబూరు, కోసిగి మండలాలకు చెందిన అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈఓలు, ఏఓలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ముందుగా పంటల నమోదు కార్యక్రమం చేపట్టి పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏడీఏ గిరిష్‌కుమార్, కోసిగి ఏఓ రాజు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లంపీస్కిన్ నివారణ టీకాలు



ఎద్దుకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

ఆదోనిరూరల్ : మండలంలోని ఢణాపురం గ్రామంలో పశువులు లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకాలను పశువైద్యురాలు డాక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో వేశారు. ఆమె మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, పశువులకు ఏ చిన్న జబ్బు వచ్చినా సమాచారం అందించాలన్నారు. అనంతరం రైతుభరోసా కేంద్రంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. పశువులు కలిగిన రైతులకు ఆర్‌బీకేలలో పశుమేత కోసం జొన్న, మొక్కజొన్న విత్తనాలు సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గొర్రెలు, మేకలకు అవసరమైన టీకాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఏహెచ్‌ఏలు తనూజ, జహీర్‌బాషా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

యుద్ధాలతో అనర్థాలే..



విద్యార్థిని నోట్ పుస్తకాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రంగారెడ్డి

ఆదోని సెంట్రల్: యుద్ధాల వల్ల అనర్థాలే తప్ప ప్రయోజనం లేదని డీఈఓ వి.రంగారెడ్డి తెలిపారు. బుధవారం పురపాలక ఉన్నత పాఠశాలలో హిరోషిమా, నాగసాకి దినోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధంలో అణుబాంబును ప్రయోగించడం వలన ఆయా ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని వివరించారు. ఏపీసీఓఎస్‌టీ డైరెక్టర్ కో ఆర్డినేటర్ రంగమ్మ మాట్లాడారు. అనంతరం డీఈఓ తరగతులను పరిశీలించి విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. నోట్ పుస్తకాలను ఎప్పటికప్పుడు చెక్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్ఎం మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు

మంత్రాలయం రూరల్: ప్రమాదాల నివారణ దృష్ట్యా చెట్నేహళ్లి, కల్లుదేవకుంట, చిలకలడోణ గ్రామాల్లో ఇనుప బారికేడ్లను మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి 16పై ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యల్లో భాగంగా బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'బీజేపీని సాగనంపాలి'

ఆదోని సెంట్రల్: ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు శ్రీనిత్ తెలిపారు. బుధవారం యువజన కాంగ్రెస్ దినోత్సవం పురస్కరించుకొని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ పెట్టుబడి దారులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. దీంతో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 40లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయలేక పోతున్నారని మండిపడ్డారు. నాయకులు నవీన్ కుమార్, రామానాయుడు, రవి, అర్జున్, వీరేష్, శివ, తిమ్మప్ప పాల్గొన్నారు.

నాడు–నేడు పేరుతో ప్రభుత్వం వైద్యరంగాన్ని ప్రక్షాళన చేసింది. దీంతో పేదలకు మెరుగైన, నాణ్యమైన సేవలందుతున్నాయి. అలాగే ప్రజల నమ్మకాన్ని చూరగొంటున్నాయి. స్థానిక మాతాశిశు ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య భారీగా పెరిగింది. గతేడాది మార్చి నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు 4,871 ప్రసవాలు జరిగాయి. అందులో 2,978 సుఖ ప్రసవాలు. దీంతో గ్రామాల ప్రాంతాల నుంచి గర్భిణులు ఆదోని ఆసుపత్రికి తరలివస్తున్నారు. ముఖ్యంగా ఆసుపత్రి వైద్యుల స్పందన, సేవలు బాగుండటంతో కర్ణాటక రాష్ట్రంలోని పలు గ్రామాల గర్భిణులు ప్రసవాలకు ఇక్కడికే వస్తున్నారు.

ప్రసవాల్లో భేష్..

- పట్టణంలోని మాతాశిశు ఆస్పత్రిలో సుఖప్రసవాలు
- నాణ్యమైన సేవలతో ఆస్పత్రిపై ప్రజల్లో పెరిగిన నమ్మకం
- గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది మార్చి వరకు 4,871 ప్రసవాలు
- త్వరలో ప్రారంభంకానున్న 50 పడకల నూతన భవనం



బాలింతల కోసం ప్రత్యేక వార్డు



ప్రభుత్వ మాతా శిశువు ఆస్పత్రి



త్వరలో ప్రారంభం కానున్న 50 పడకల నూతన ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రి

ఆదోనిఅర్బన్ : రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం రావడంతో ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నాడు–నేడు కింద రూ.10 కోట్లతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వంద పడకల నూతన భవనం, రూ.7 కోట్లతో ఎన్ఆర్‌హెచ్ఎం జాతీయ ఆరోగ్యమిషన్ నిధుల కింద ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రి కోసం మరొక 50 పడకల నూతన భవనం తుది దశలో ఉన్నాయి. ప్రస్తుతమున్న ఆసుపత్రుల్లో సైతం సౌకర్యాలు కల్పించడం, సేవలను మెరుగుపచడంతో ప్రజల్లో నమ్మకం పెరిగింది.

సేవలపై సంతోషం..

గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న సేవలపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవ సేవలు పొందేందుకు గర్భిణులు ఆసక్తి చూపుతున్నారు. ఆస్పత్రి వైద్యులు కూడా సుఖ ప్రసవాలు చేసి వారి వేదనను దూరం చేస్తున్నారు. పట్టణంలో మాతాశిశు ఆస్పత్రిలో గేతడాది నుంచి ఈ యేడాది మార్చి వరకు 4,871 ప్రసవాలు జరిగాయి. అందులో 2,978 సుఖ ప్రసవాలు, 1,831 సిజేరియన్ ప్రసవాలు జరిగాయి. ఆదోని చుట్టుపక్కల కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని సమీప గ్రామాల గర్భిణులకు ఇక్కడికే వచ్చి ప్రసవం చేయించుకుంటున్నారు. పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల గర్భిణులు ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రినే ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏప్రిల్ – 474 ప్రసవాలు చేయగా ఇందులో సుఖ ప్రసవాలు 293, సిజేరియన్ –176, మే నెలలో.. 396 కాన్పుల్లో సహజ కాన్పులు 239, సిజేరియన్ 154 జరిగాయి. జూన్‌లో..421 కాన్పుల్లో 251 సాధారణ, 170 సిజేరియన్, జూలైలో 418 కాన్పుల్లో 283 సాధారణం, 135 కోత కాన్పులు జరిగాయి. అంటే రోజుకు 14 నుంచి 15 కాన్పులు జరుగుతున్నాయి. అయితే ఒక్కో రోజు 19 వరకు చేస్తున్నామని వైద్యులు పేర్కొంటున్నారు.

సేవలే కొలమానం..

గతంలో కంటే ప్రస్తుతం గర్భిణులకు స్థానిక ఆసుపత్రిలో నాణ్యమైన సేవలందుతున్నాయి. సిబ్బంది తల్లీ,బిడ్డను కంటికి రెప్పలా చూసుకోవడం, ఓపికగా వ్యవహరించడం, గర్భిణుల పట్ల సేవా భావంతో వ్యవహరిస్తుండటంతో ఎంత దూరమైనా ఇక్కడికే ప్రసవాలు చేయించుకునేందుకు గర్భిణులు వస్తున్నారు. అలాగే కాన్పు పూర్తయిన తరువాత ప్రభుత్వ ఖర్చులతో వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నారు. దీంతో వారికి పైసా ఖర్చు కాకుండా నాణ్యమైన సేవలు పొందుతున్నారు.

రూ.7 కోట్లతో 50 పడకల నూతన భవనం

ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో రోజుకు 15 నుంచి 19 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. రోజు రోజుకు బాలింతల సంఖ్య పెరుగుతుండటంతో పడకలు తక్కువౌస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఈ ఆసుపత్రి పక్కనే రూ.7 కోట్లతో ఎన్ఆర్‌హెచ్ఎం జాతీయ ఆరోగ్యమిషన్ నిధుల కింద మరో 50 పడకల నూతన భవనం నిర్మాణం చేపడుతున్నారు. ఇది త్వరలో ప్రారంభం కానుంది. ఈ ఆస్పత్రిలో ఏడుగురు వైద్యులు ఉన్నారు.

పుట్టిన బిడ్డపై ప్రత్యేక శ్రద్ధ

ఆస్పత్రిలో నెలలు తక్కువగా పుట్టిన, బరువు తక్కువగా పుట్టినా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారికోసం ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేశారు. అధునాతన సాంకేతికతతో కూడిన వైద్యాన్ని అందజేస్తున్నారు. పిల్లలకు వ్యాధినిరోధక వ్యాక్సిన్‌లను ఆస్పత్రిలోనే వేస్తున్నారు. ఈ సౌకర్యాల వల్ల గతంలో పోలిస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఇలాంటి సేవలు కార్పొరేట్ ఆస్పత్రిలో కూడా దొరకవు



తొమ్మిది రోజుల పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యం అందించి బాగా చూసుకున్నారు. పుట్టిన బిడ్డకు వైద్యులు, సిబ్బంది బాధ్యతతో చికిత్స చేశారు. ప్రసవం కాకముందు, అయిన తర్వాత కూడా సమయానికి చికిత్స చేశారు. తొమ్మిది రోజుల తర్వాత వాహనంలో మమ్మల్ని ఇంటి వద్దకు వదిలి పెట్టారు. ప్రైవేట్ ఆస్పత్రిలో డబ్బులు ఇచ్చినా ఇలాంటి సేవలు దొరకవు. – శ్రావణి, లక్ష్మారి గ్రామం

బాలింతలను వాహనంలో ఉచితంగా, సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నాం



బాలింతలను వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఉచితంగా సురక్షితంగా ఇంటి వద్ద దిగబెడతున్నాం. చాలాసార్లు కర్ణాటక, ఇతర జిల్లాల్లో కూడా వదిలిపెట్టి వచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడు వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి. రోజుకు ముగ్గురు లేదా నలుగురు బాలింతలను సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నాం.
– నాగరాజు, వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ డ్రైవర్

సుఖ ప్రసవానికే ప్రాధాన్యతనిస్తున్నాం

ఎక్కువశాతం సుఖ ప్రసవాలకే ప్రాధాన్యత ఇస్తున్నాం. అత్యవసరం అనుకుంటేనే సిజేరియన్ చేస్తున్నాం. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఏడుగురు డాక్టర్లు ఉన్నారు. ఎవరిని వెనక్కి పంపకుండా సేవలందిస్తునఆనం. రోజుకు 15 నుంచి 19 వరకు ప్రసవాలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తల్లీబిడ్డలను కంటికి రెప్పలా చూసుకుంటూ ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నాం. ఏడు నుంచి తొమ్మిది రోజుల వరకు ఆస్పత్రిలో ఉంచి వారికి ఆరోగ్యంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా సురక్షితంగా పంపుతున్నాం. పుట్టిన బిడ్డకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నాం. – మాధవీలత, ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రి సూపరింటెండెంట్

ఆదర్శ పాలనపై అసత్య ప్రచారం



శుక్రవార పేటలో లక్ష్మితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : రాష్ట్రంలో జగనన్న ఆధ్వర్యంలో ఆదర్శ పానల సాగుతుంటే ఓర్వలేక విపక్షాలు అసత్య ప్రచారానికి తెరతీశాయని, వీరంతా కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే బయటకు వస్తారని, ఆ తరువాత ప్రజల గురించి పట్టించుకోరని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 40వ వార్డు శుక్రవారంపేట, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం రాత్రి 7;30 గంటలకు ముగిసింది.ఆయన మాట్లాడుతూ విపక్షాల కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు పోలకల్ రేణుక, మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, పట్టణాధ్యక్షుడు దేవా, కౌన్సిలర్ ఇందు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, నాయకులు దుర్గప్ప, చంద్ర, రామకృష్ణ,శ్రీదేవి, జిలేకాబీ, బ్రహ్మయ్య, చిన్నఈరన్న, భీమ, ఇస్మాయిల్, దస్తగిరినాయుడు లక్ష్మన్న, తాయన్న, కల్పవల్లి పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



బీఎల్ఓల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిటౌన్ : ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపడుతున్న ఇంటింటి సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. పకడ్బందీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం –2024కు సంబంధించిన కార్యక్రమంపై నియోజకవర్గంలో అదనపు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఎన్నికల ఉప తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశంనిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో వలంటీర్ల ప్రమేయం ఉండరాదని ఆదేశించారు. 2024 తుది ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్పెషల్, సమ్మరి, రివిజన్–2024లో ఎక్కడ కూడా పొరపాట్లకు ఆస్కారం లేకుండా బాధ్యతాయుతంగా నిర్వహించాలని చెప్పారు. బూత్ స్థాయి అధికారులతో ఇంటింటి ఓటర్ల పరిశీలన చేస్తున్న సమయంలోనూ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు సైతం ఎటువంటి అపోహలు లేకుండా చూడాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన వారు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. తద్వారా పర్యటన వివరాల ముందస్తు సమాచారం వారికి ఇవ్వాలని, వారు కూడా ఇంటి ఓటర్ సర్వేలో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను ఎన్నికల అధికారి కార్యాలయంలో సమర్పించాలని చెప్పారు.18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ట్రాన్స్‌జెండర్స్, సెక్స్ వర్కర్లు ఓటర్లుగా గుర్తిస్తూ వారి పూర్తి వివరాలను సేకరించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. జనవరి 2024 నాటికి 18 సంవత్సరాలు నిండే వారిని కూడా గుర్తించి సమాచారం సేకరించాలన్నారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి..

ఆదోనిరూరల్ : బీఎల్ఓలు, సూపర్‌వైజర్‌లు బాధ్యతాయుతంగా పనిచేయకపోతే కఠిన చర్యలు తప్పవని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక రెవెన్యూభవన్‌లో ఆదోని మండల బీఎల్ఓలు, సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల సవరణ రెన్యూవల్ 2023–24కు సంబంధించి ఓటర్ల జాబితా తప్పులతడకగా ఉందని, అందుకు సంబంధించి బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి సరిచేయాలని ఆదేశించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, సూపర్‌వైజర్‌లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించండి

ఆదోని సెంట్రల్: పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఆదోని పురపాలక సమాఖ్య అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్,జె.బసవరాజు కోరారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలు పొందకుండా చాలామంది రిటైర్ అవుతున్నారని వాపోయారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల పర్యవేక్షణ, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారాలు ఇవ్వాలని కోరారు. అనంతరం డీఈఓ రంగారెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. దస్తగిరి, మద్దయ్య, బసవరాజు, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఆస్పరి: విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం ఆస్పరి కస్తూర్బా పాఠశాల, బిణిగేరిలోని అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ షాపును తనిఖీ చేశారు. బిణిగేరిలో డీలర్ గరీబ్ బాషా మాట్లాడుతూ.. పత్తికొండ స్టాక్ పాయింట్ నుంచి వచ్చే బియ్యం తూకాల్లో తేడాలు ఉంటున్నాయని తెలిపారు. తాము బియ్యం కోసం వెళ్లినప్పుడు ఇవ్వకుండా మరుసటి రోజు గ్రామానికే పంపిస్తున్నారని చెప్పారు. సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. చివరగా కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈఓ రంగారెడ్డి, పత్తికొండ ఆర్‌డీఓ మోహన్‌దాస్, తహసీల్దార్ కుమారస్వామి, డాక్టర్ రఘురామిరెడ్డి, సీడీపీఓ నిర్మలాదేవి ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దకడబూరు : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఎరిషావలి తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక మద్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు కల్లుకుంట గ్రామం వెలుపల నబిసాబ్ దర్గా వద్ద దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నాగులాపురం గ్రామానికి చెందిన ఈరన్న, ఆంజనేయ, కల్లుకుంట గ్రామానికి చెందిన దుర్గప్ప, యువరాజు నుంచి 8బాక్స్‌ల (786) టెట్రా 90ఎంఎల్ ప్యాకెట్లును స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

మంత్రాలయం రూరల్: రాయచూరు జిల్లా గిలకసూగూరు గ్రామానికి చెందిన బోయ నాగరాజు కర్ణాటక మద్యాన్ని తుంగభద్ర నది ఒడ్డు నుంచి మాధవరం గ్రామంలోకి తీసుకొస్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు బుధవారం తెలిపారు. నిందితుడి నుంచి 384 (నాలుగు బాక్సులు) ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. తుంగభద్ర నది మీదుగా దాటించి మాధవరం గ్రామంలో విక్రయిస్తున్నాడే సమాచారం మేరకు దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

అనాథలకు అన్నదానం

ఆదోనిఅర్బన్ : సినీ నటుడు మహేష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం అభిమాన సంఘం నాయకులు స్థానిక జీవనజ్యోతి ఆశ్రమంలో అనాథ వృద్ధులు, మానసిక రోగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సంఘం నాయకులు మహేష్, విజయ్‌కుమార్, నాగప్ప, పవన్, ఆశ్రమ డైరెక్టర్ విక్టర్‌పాల్ ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు. అంతకముందు కేక్ కట్ చేసి పంచి పెట్టారు.

కూలీలకు వేతనాలు పెంచాలి

కౌతాళం: కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు అందించే రోజు వారి వేతనాన్ని పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీరసూల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల వేతనాలను పెంచాలన్నారు. అనంతరం వ్యవసాయకార్మిక సంఘం మండల నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శి శివతో పాటు 9 మందిని ఎన్నుకున్నారు. కోసిగి మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి రాజు, పెద్దకడబూరు మండల అధ్యక్షుడు నాగేష్, శివ, మంత్రాలయం మండల అధ్యక్షుడు నబీరసూల్, మాబాషా పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకుందాం

కౌతాళం: కేంద్రంలోని బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకుందామని రైతు సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు మల్లయ్య అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల పక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్ఐ రాజశేఖర్‌కు వినతిపత్ర అందజేశారు. వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఆవలంబించిన కార్మిక వ్యతిరేక విధానాల వల్ల ప్రజలపై పన్నుల భారం పడిందని, కార్పొరేట్ సంస్థలు బాగుపడ్డాయని మండిపడ్డారు. రైతుల భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారని విమర్శించారు. రైతు కూలీ సంఘం మండలాధ్యక్షుడు జగదీష్, నాయకులు సత్యప్ప,మారయ్య,వలి, వెంకోబా, రత్నయ్య ఉన్నారు.

రహదారి సమస్య పరిష్కారం

మంత్రాలయం రూరల్: మండలంలోని సుంకేశ్వరి ఎస్సీ కాలనీలో నెలకొన్న రహదారి సమస్యకు పరిష్కారం లభించింది. వర్షపు నీరు, మురుగుతో పూర్తిగా బురదమయంగా మారడంతో కాలనీవాసులు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గరుసుతో చదును చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం కాలనీలో మట్టితో గుంతలను పూడ్చి చదును చేశారు. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఎకరాకు సాగునీరందించాలి



ఇరిగేషన్ అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరందించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని రాంపురం గ్రామంలో ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గురురాఘవేంద్ర ప్రాజెక్టు, పులికనుమ తుంగభద్ర నదికి నీళ్లు వచ్చిన వెంటనే నీటితో నింపి ఆయకట్టు రైతులకు కాలువల ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. నదికి నీరు వచ్చేలోపు మరమ్మతులు ఉంటే చేయించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యత తీవ్రత ఎక్కువగా ఉంటే నివేదికలు అందజేస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి వెంటనే నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. పులికనుమ ప్రాజెక్టు నుంచి కోసిగి బోగోని చెరువుకు వేస్తున్న పైపులైన్ పనులు త్వరలోనే పూర్తవుతాయని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జి.భీమారెడ్డి, ఐరన్‌గల్లు శ్రీనివాసరెడ్డి, జీఆర్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శైలేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మురళీ, కృపానంద్, ఏఈలు హరి ప్రసాద్, ప్రేమ్,రంగస్వామి, ఈశ్వర్, రాజేష్‌కుమార్ ఉన్నారు.

అమరవీరుల సేవలు మరువలేనివి



రాంపురంలో శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



చిన్నకడబూరులో శిలాఫలం ఏర్పాటు చేసిన దృశ్యం

మంత్రాలయం రూరల్: దేశ సేవలో అమరజవానుల సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. నా దేశం– నాభూమి కార్యక్రమాన్ని రాంపురం గ్రామం సచివాలయం వద్ద బుధవారం నిర్వహించారు. మండల కన్వీనర్ జీ.భీమిరెడ్డితో కలసి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. అధికారులు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. మొక్కలు నాటి నీరుపోశారు. ఎంపీడీఓ మణిమంజరి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఏపీవో తిమ్మారెడ్డి, ఎస్ఐ కిరణ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి బాషా, వీఆర్వో కాశీం పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : మండలంలోని బసరకోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మేరీ మిట్టి–మేరీ దేశ్ కార్యక్రమాన్ని ఆదోని మండల ప్రత్యేకాధికారి సుబ్రహ్మణం ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం 75 మొక్కలను నాటి నీరు పోశారు.

పెద్దకడబూరు : దేశ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని జెడ్పీటీసీ రాజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చిన్నకడబూరు, రంగాపురం గ్రామాల్లో శిలాఫలకాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం, నేల తల్లికి వందనం, సాహసవీరులకు వందనం వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఏపీడీ లోకేశ్వర్, ఎంఈఓ రామమూర్తి, ఏపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న విద్యుత్ ఉద్యోగులు

మంత్రాలయం/మంత్రాలయం రూరల్: విద్యుత్ ఉద్యోగల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వై.బాలనారెడ్డికి విద్యుత్ ఉద్యోగులు బుధవారం వినతి పత్రాన్ని రాంపురంలో అందజేశారు. ఏడీ విశ్వశాంతి స్వరూప్, రాఘవేంద్రప్ప, ఏఈ గోవిందు మాట్లాడుతూ.. ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, రెగ్యులర్ ఉద్యోగలకు పీఆర్‌సీ ఇవ్వాలని, ఔట్‌సోర్స్ ఉద్యోగులకు నేరుగా ప్రభుత్వమే వారి ఖాతాల్లో వేతనాలు జమచేయాలని కోరారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

క్విట్ కార్పొరేట్... సేవ్ ఇండియా



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్ : క్విట్ కార్పొరేట్.. సేవ్ ఇండియా అనే నినాదంతో రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మిక, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాల్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు దేవిశెట్టి ప్రకాష్, జిల్లా కార్యదర్శి అజయ్‌బాబు, సీఐటీయూ జిల్లా నాయకుడు మహానందరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలను పెంచి పోషిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ కేంద్రంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు మల్లికార్జున, మని, వీరారెడ్డి, తిప్పన్న, వెంకప్ప, ప్రకాష్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

హొళగుంద: మండల కేంద్రంలోని 7వ వార్డుకు చెందిన ఫిరదౌసి అనే గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు రావడంతో సుఖ ప్రసవం జరిగేలా సిబ్బంది చికిత్స అందించారు. వివరాలు.. బుధవారం తెల్లవారుజామున పురిటినొప్పులు రావడంతో ఆశ కార్యకర్త జయలక్ష్మి వెంటనే అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. ఆదోని ఎంసీహెచ్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా నెరణికి– ముద్దనగేరి మధ్యలో ఈఎంటీ కె.యల్లయ్య సహకారంతో ప్రసవం జరిగింది.